క్లుప్తంగా

అర్హులకే బీసీబంధు ఇవ్వాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న రాజు

కొల్చారం(నర్సాపూర్): నిరుపేదలైన నిజమైన అర్హులకు మాత్రమే బీసీ బంధు వర్తించేలా చర్యలు తీసుకోవాలని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దర్జి రాజు ఆధ్వర్యంలో శుక్రవారం మండల ఎంపీడీఓ గణేశ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. విఠల్, నర్సింలు, యాదగిరి, శేఖర్, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఓను సస్పెండ్ చేయాలి



డీఈఓ రాధాకిషన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మెదక్ కలెక్టరేట్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకుండా ఇబ్బందులకు గురిచేయడంతో పాటు అడిగిన వారిపై బెదిరింపులకు పాల్పడుతున్న కేజీబీవీ ఎస్‌ఓలను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జగన్, ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో డీఈఓ రాధాకిషన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కొల్చారం, పెద్దశంకరంపేటలలోని కేజీబీవీ స్కూల్ స్పెషల్ ఆఫీసర్స్(ఎస్‌ఓ) విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదన్నారు. అలాగే స్థానికంగా ఉన్న టీచర్లు రాత్రి 12 గంటల వరకు చదివిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. అలాగే మండలం తునికిలోని ఎంజేపీ ప్రిన్సిపల్ విద్యాహక్కు చట్టానికి వ్యతిరేకంగా విద్యార్థులతో వెట్టి చాకిరి చేయిస్తున్నారని ఆరోపించారు.

విద్యలో రాణించాలి

కొల్చారం(నర్సాపూర్): విద్యలో రాణించినప్పుడే ప్రతీ విద్యార్థికి గుర్తింపు లభిస్తుందని కెనరా బ్యాంక్ (కొల్చారం బ్రాంచ్)డివిజనల్ మేనేజర్ సత్య రమేశ్ పేర్కొన్నారు. శుక్రవారం కొల్చారం, పోతంశెట్టిపల్లి కెనరా బ్యాంక్ శాఖల ఆధ్వర్యంలో కెనరా విద్యా జ్యోతి స్కీమ్ కింద మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలను అందజేశారు. పై తరగతుల్లో మొదటి స్థానం నిలిచిన వారికి రూ.5వేలు, రెండో స్థానంలో నిలిచిన వారికి రూ.2500లను పది మందికి డీడీల రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ క్రాంతి కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

మెదక్: పాత పెన్షన్ విధానం అమలు చేయాలనే డిమాండ్‌తో సెప్టెంబర్ 1న, ఇందిరా పార్కువద్ద జరిగే ధర్నాకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధ్యాయులు తరలి రావాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) నాయకుడు రావ రవి అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీఎన్‌జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మట్లాడుతూ.. చలో హైదరాబాద్ సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆయన హాజరై మాట్లాడారు. హైదరాబాదులో నిర్వహించే మహాధర్నాకు జిల్లాలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు విజయవంతం చేయాలన్నారు. కొండల్‌రెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, పద్మారావు, సంగయ్య, యాదగిరి, అజయ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, బీమ్లానాయక్, ఉన్నారు.

'బీజేపీదే అధికారం'

తూప్రాన్: రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి తెలంగాణలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆ పార్టీ మహారాష్ట్ర వాల్దా ఎమ్మెల్యే పంకజ్ గోయల్ ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం తూప్రాన్, మనోహరాబాద్ మండలాలకు చెందిన ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ సాయిబాబా, నర్సోజి, సీనియర్ నాయకులు ఓబీసీ మెంబర్ బండారు దుర్గరాజు యాదవ్, తాటి విఠల్, మున్సిపల్ శాఖ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు

నర్సాపూర్: బీజేపీ నాయకులను పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్టు చేశారు. జిల్లా కలెక్టరేట్‌ల ముట్టడికి పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నర్సాపూర్ నుంచి పార్టీ నాయకులు మెదక్ వెళ్తుండగా సీఐ షేక్ లాల్‌మధార్ ఆధ్వర్యంలో ఎస్ఐ శివకుమార్, సిబ్బంది వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసిన వారిలో బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

చేగుంట(తూప్రాన్): మండలంలోని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసిన వారిలో బీజేపీ నాయకులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రావణమాసం సందర్భంగా ఆయా ఆలయాల్లో అర్చకులు అభిషేకం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవార్లకు ఒడిబియ్యం పోసి, మొక్కులు తీర్చుకున్నారు.



శివ్వంపేట(నర్సాపూర్): భగలాముఖీ ఆలయంలో వరలక్ష్మి వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు



చిలప్‌చెడ్(నర్సాపూర్): జగ్గంపేటలో..



అల్లాదుర్గంలో ..



కొల్చారం(నర్సాపూర్): కొల్చారంలో ..



మెదక్ మున్సిపాలిటీ: శిశుమందిర్‌లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు



పెద్దశంకరంపేటలో సామూహిక కుంకుమార్చనలు

విస్తరాకుల తయారీ పరిశ్రమ పరిశీలన




విస్తరాకులు పరిశీలిస్తున్న అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

రామాయంపేట(మెదక్): రామాయంపేటలోని మహిళా సంక్షేమ మండలిలో నిర్వహిస్తున్న విస్తరాకుల తయారీ కుటీర పరిశ్రమను శుక్రవారం రాష్ట్ర, జిల్లా అధికారులతో పాటు యూఎస్ఏయిడ్, ఫారెస్ట్ ప్లస్ 2.0 స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, అటవీ శాఖ ఉన్నతాధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా కంపా పీసీసీఎఫ్, ముఖ్య వణ్యప్రాణి సంరక్షణ అధికారి లోకేశ్ జైశ్వాల్, రాజన్న సిరిసిల్లా సర్కిల్ సీసీఎఫ్ శరవణన్, డీఎఫ్‌వో రవిప్రసాద్, డీఆర్డీఓ శ్రీనివాస్ మహిళలతో మాట్లాడి ఎంత ఆదాయం సమకూరుతుందో వివరాలు తెలుసుకున్నారు. మహిళల ఆర్థిక పురోభివృద్ధికి ఆధునిక పనిముట్లు అందజేస్తామని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు.

ఆడపిల్లలను రక్షిద్దాం, చదివిద్దాం

కౌడిపల్లి(నర్సాపూర్): ఆడపిల్లను రక్షిద్దాం, చదివిద్దామని మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ నాగమణి తెలిపారు. శుక్రవారం కౌడిపల్లిలోని గిరిజన బాలికల మినీ గురుకులంలో బేటి బచావో, బేటి పడావో కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆడపిల్లలను రక్షించడం, చదివించడం అందరి బాధ్యత అన్నారు. బాల్య వివాహలు చేయొద్దన్నారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. ఆడ పిల్లలకు సమస్య ఉంటే హెల్ప్‌లైన్ 181, 1098, 100 ఫోన్ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జమునరాణి, కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గురుకులంలో అవగాహన కల్పిస్తున్న నాగమణి

కౌడిపల్లి(నర్సాపూర్): బాల్య వివాహాలు చేయొద్దని కార్పెడ్ స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్ దుర్గమణి తెలిపారు. శుక్రవారం కౌడిపల్లిలోని ఎస్టీ హాస్టల్, ఆశ్రమ పాఠశాలలో కైలాష్ సత్యార్థి ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు బాల్య వివాహాలు, పిల్లల అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో బాల్యవివాహాలకు వ్యతిరేఖంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ యాదయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అధికారులు

నర్సాపూర్: అటవి శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం నర్సాపూర్ అడవులను పరిశీలించి అడవిలో మొక్కలు నాటారు. అటవీశాఖ నర్సాపూర్ రేంజ్ పరిధిలోని అర్బన్ పార్కును, కొండాపూర్ ప్లాంటేషన్‌ను ప్రిన్సిపాల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(కంపా) లోకేష్ జెస్వాల్‌తో పాటు పలువురు ఇతర దేశాల ప్రతినిధులు పరిశీలించారు. అనంతరం అర్బన్ పార్కు ఏరియాలో మొక్కలు నాటారు. అడవులను కాపాడడంతో పాటు ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలను సైతం కాపాడాలని ఈ సందర్బంగా లోకేష్ జెస్వాల్ అటవి సిబ్బందికి సూచించారు. ఆయన వెంట డీఎఫ్ఓ రవిప్రసాద్, సీసీఎఫ్ సర్వానంద్, ఎఫ్ఆర్ఓ అంబర్‌సింగ్ ఉన్నారు.



నర్సాపూర్ రేంజ్ పరిధిలోని ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

నేడు స్పాట్ అడ్మిషన్లు

మెదక్ మున్సిపాలిటీ: నేడు మెదక్‌లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపబూల్ వరలక్ష్మి శుక్రవారం తెలిపారు.

నేడు మెదక్ పట్టణంలో నీటి సరఫరా బంద్

మెదక్ మున్సిపాలిటీ: నేడు అనివార్య కారణాలతో మెదక్ పట్టణంలో నీటి సరఫరా ఉండదని, పట్టణ ప్రజలు గమనించి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ జానకీరాంసాగర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

అందరికీ దళితబంధు ఇవ్వండి

టేక్మాల్(మెదక్): మండలంలోని కుసంగి గ్రామంలో ఉన్న దళితులందరికీ దళితబంధు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం టేక్మాల్ మండల పరిషత్ కార్యాలయంలోని సూపరింటెండెంట్ విష్ణువర్దన్‌కు వినతి పత్రం అందించారు. ఇందులో అంజయ్య, దుర్గయ్య, బాలయ్య, శివయ్య, మల్లయ్య, అర్జున్ తదితరులు ఉన్నారు.

చేగుంటకు డిగ్రీ కళాశాల కావాలి



మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రానికి డిగ్రీ కళాశాల కావాలని, చేగుంటకు డిగ్రీ కళాశాల మంజూరీ చేయించని ఎంపీ ప్రభాకర్‌రెడ్డిని ప్రజలు నిలదీయాలని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. చేగుంటలో శుక్రవారం ఎమ్మెల్యే మాట్లాడారు. మెదక్ సీఎం పర్యటనలో మెదక్ నియోజకవర్గం, నర్సాపూర్ నియోకవర్గాలకు ముఖ్యమంత్రి డిగ్రీ కళాశాల మంజూరీ ప్రకటిస్తే పక్కనే ఉన్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి చేగుంటకు డిగ్రీ కళాశాల కావాలని ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. సమావేశంలో కర్నపాండు, వైస్ ఎంపీపీ రాంచంద్రం, బీజేపీ మండలాధ్యక్షులు భూపాల్, సంతోష్‌రెడ్డి, నర్సింలు, ఆయా గ్రామాల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గోరు సైజులో చంద్రయాన్ 3

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేటకు చెందిన అవుసుల శ్రీనివాస్‌చారి సూక్ష్మ కళాఖండాల తయారీ కళాకారుడు. ఇస్రో చంద్రయాన్ 3 విజయవంతం కావడంతో బొటన వేలిగోరు సైజులో 300 మిల్లీ గ్రాముల బంగారంతో సూక్ష్మ చంద్రయాన్ 3ను తయారు చేశాడు. నమూనాపై జాతీయ జెండా రంగులు ఉండటంతో మరింత ఆకర్షణీయంగా ఉంది. దీంతో అందరినీ ఆకట్టుకుంటోంది.



చేతి గోటిపై బంగారు చంద్రయాన్-3

రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ముసాయిదా

నాలుగు మండలాలతో డివిజన్

రామాయంపేట(మెదక్): రామాయంపేట కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సంబంధించి ముసాయిదా విడుదలైంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మెదక్ డివిజన్ పరిధిలో ఉన్న రామాయంపేట కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటు కోసం ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్ పూర్తి వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదించారు. ప్రస్తుతం మెదక్ డివిజన్ పరిధిలో ఉన్న రామాయంపేట, నిజాంపేట, చిన్నశంకరంపేట, తూప్రాన్ పరిధిలో ఉన్న నార్సింగి మండలాలను వేరు చేసి రామాయంపేట కేంద్రంగా కొత్త డివిజన్ ఆవిర్భవించనుంది. సాధ్యమైనంత తొందరగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఏవైనా అభ్యంతరాలుంటే 15 రోజుల్లో అప్పీలు చేసుకోవాలని వారు సూచించారు.

ఓటుహక్కు నమోదును వినియోగించుకోండి

నర్సాపూర్: ఓటరుగా నమోదు కార్యక్రమంలో భాగంగా బీఎల్‌ఓలు శుక్రవారం ప్రతి పోలింగ్ స్టేషన్‌ల్లో అందుబాటులో ఉంటారని నర్సాపూర్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు తెలిపారు.

వెల్దుర్తి(తూప్రాన్): ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు నమోదును సద్వినియోగం చేసుకోవాలని మాసాయిపేట తహసీల్దార్ జ్ఞానజ్యోతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం మాసాయిపేట తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితాపై బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 26, 27 సెప్టెంబర్ 2, 3వ తేదీల్లో ఆయా బూత్‌ల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని 18 ఏళ్ళు పైబడిన వారు కూడా ఓటర్ నమోదుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): యువకులు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడానికి ఈ నెల 26, 27వ తేదీల్లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

లింగాకర్షక బుట్టలతో చీడపీడల గుర్తింపు

చిలప్‌చెడ్(నర్సాపూర్): పత్తి, వరి సాగుల్లో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయడంతో చీడపీడల ఉధృతిని త్వరగా గుర్తించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులు అన్నారు. శుక్రవారం మండలంలోని గౌతాపూర్ గ్రామంలో వారు ఏరువాక కేంద్రం, సంగుపేట ఆధ్వర్యంలో గ్రామంలోని పలువురి రైతుల పత్తి పంటల్లో లింగాకర్షక బుట్టల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. అగ్రికల్చర్ విద్యార్థులు సిద్దార్థ, విద్యాసాగర్, సత్యనారాయణ, హరీశ్, హరీశ్ యాదవ్, ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ విద్యార్థులు

నర్సాపూర్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

టీపీసీసీ కార్యదర్శి రాజిరెడ్డి



మాట్లాడుతున్న రాజిరెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): నర్సాపూర్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని టీపీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలం రాజిపేట జాజితండా, కుషన్‌గడ్డతండా, తిమ్మాపూర్, రాయిలాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ జెండా పండగను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి పాలన కొనసాగిస్తుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ డెలిగెట్స్ రవీందర్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, జిల్లా కార్యదర్శి పాషా, మండల బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, సేవాదల్ అధ్యక్షుడు లక్ష్మణ్, యూత్ అధ్యక్షుడు ధన్‌సింగ్, నాయకులు సురేశ్, యాదగిరి, శంకర్‌గౌడ్, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పట్టించుకోని అధికారులు

చేగుంట(తూప్రాన్): విద్యుత్ శాఖ అధికారులు గ్రామాల్లోని సమస్యలను పట్టించుకోవడం లేదని చేగుంట మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అన్నారు. ఎంపీపీ శ్రీనివాస్ అధ్యక్షతన చేగుంట మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నశివునూర్‌లో రెండు సింగిల్‌ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద విద్యుత్ షాక్ వస్తున్నట్లు అధికారులకు తెలిపినా.. పట్టించుకోవడం లేదని సర్పంచ్ అశోక్ ఆగ్రహించారు. చందాయిపేటలో విద్యుత్ వైర్లు ఒకదానికొకటి తగిలి మంటలు వస్తున్నట్లు సమాచారం అందించినా అధికారులు రిపేర్‌లు చేయించడం లేదని సర్పంచ్ స్వర్ణలత వాపోయారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్, ఎంపీడీఓ ఆనందమేరీ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు,ఎంపీటీసీలు,అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్

రైతు వినూత్న ఆలోచన

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఓ రైతు తన పత్తి పంటలో పురుగు మందు పిచికారీ చేయడానికి డ్రోన్‌ను వినియోగించి పని సులభతరం చేసుకున్నాడు. శుక్రవారం మండలంలోని చండూర్ గ్రామానికి చెందిన రైతు విష్ణువర్ధన్‌రెడ్డి కామారెడ్డి నుంచి డ్రోన్‌ను తెప్పించి, ఆపరేటర్ సాయంతో తన పత్తి పంటకు పురుగు మందులు పిచికారీ చేయించారు. ఈ విధానంతో ఎకరాకు రూ. 5 వందలు ఖర్చు అవుతుందని, కాగా పని సులభతరం అవుతుందన్నారు. మందులు పిచికారీ చేసే కూలీలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు.



పత్తి పంటలో పురుగుమందు పిచికారీకి డ్రోన్‌ను ఆపరేటర్ చేస్తున్న రైతు

సంక్షిప్త వార్తలు

◆ **సన్మానం**

మెదక్ కలెక్టరేట్: కలెక్టరేట్ ముట్టడిని విజయంతం చేసిన బీజేపీ నాయకులను పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నందు జనార్దన్‌రెడ్డి, నందారెడ్డి, తాళ్లపల్లి రాజశేఖర్ సన్మానించి అభినందించారు. బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మెదక్ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని ముట్టడిని విజయంతం చేసిన నాయకులు శివ, నాయిని ప్రసాద్ తదితరులను పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ పోలీస్‌స్టేషన్‌లో బయటకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

◆ **నేడు ఆయిల్ పాం సాగుపై రైతులకు అవగాహన సదస్సు**

తూప్రాన్: ఆయిల్ పాం సాగుపై రైతులకు మండలంలోని గుండ్రెడ్డిపల్లి రైతు వేదికలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ విస్తరణ అధికారి సింధూ తెలిపారు.

◆ **ప్రారంభమైన బంగారమ్మ జాతర**

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్‌లోని వనదుర్గ బంగారమ్మ అమ్మవారి జాతరను శుక్రవారం గ్రామస్తులు ప్రారంభించారు. ఈ సందర్బంగా శుక్రవారం అమ్మవారి ఘటాన్ని గ్రామంలో ఊరేగించారు.

◆ **సమస్యలు పరిష్కరించాలి**

నర్సాపూర్ రూరల్: మీసేవ నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ కిషోర్‌కు మీసేవ నిర్వాహకులు విజయ్, ప్రసాద్ వినతిపత్రం అందజేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మీసేవ నిర్వాహకుల కమీషన్ పెంచాలని, పహాని, ఆర్ఓఆర్, ధరణి లావాదేవీలు మీ సేవల ద్వారా జరిగేలా పునరుద్ధరించాలని కోరారు. మీ సేవలో నిర్వాహకులకు హెల్త్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మీసేవ నిర్వాహకులు పాల్గొన్నారు.

◆ **కొనసాగుతున్న ఏఎన్ఎంల సమ్మె**

మెదక్ కలెక్టరేట్: రెగ్యులరైజ్ చేయాలన్న డిమాండ్‌తో జిల్లాలోని సెకండ్ ఏఎన్ఎంలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 10వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు చెందిన సెకండ్ ఏఎన్ఎంలు కలెక్టరేట్ ముందు బైఠాయించి సమ్మె కొనసాగించారు. జిల్లాలోని సెకండ్ ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

◆ **పారిశుద్ధ్య పనులు ప్రారంభించండి**

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో గ్రామంలో దోమలు విజృంభిస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు డెంగీ, మలేరియా వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామస్తులు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో గ్రామంలో దోమల తీవ్రత ఎక్కువైందని గ్రామస్తులు ఆవేదన చేస్తున్నారు. వార్డు సభ్యులు మహేందర్ గౌడ్, శివ రాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **ఇంటింటికీ కాంగ్రెస్ డిక్లరేషన్**

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు అందించనున్న పథకాలను వివరిస్తూ ప్రకటించిన కాంగ్రెస్ డిక్లరేషన్ పత్రాలను ఇంటింటికీ అందిస్తున్నట్లు వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని సంగాయిపల్లి గ్రామంలో ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీటీసీలు శివకుమార్, ప్రసాద్‌గౌడ్, నవీన్, రమేశ్, శ్రీకాంత్‌గౌడ్, శివ, శ్రీనివాస్, నర్సాగౌడ్ తదితరులు ఉన్నారు.

◆ **రెవెన్యూ డివిజన్ ఏర్పాటు హర్షనీయం**

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ ఏర్పాటు రామాయంపేట ప్రాంతవాసుల చిరకాల కోరిక అని, సీఎం కేసీఆర్ కృషితో వారి కోరిక నెరవేరిందని నార్సింగి మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, రాజేశ్, ప్రధాన కార్యదర్శి బూపతిరాజు పేర్కొన్నారు. వారు శుక్రవారం మాట్లాడారు. నాయకలు ప్రభాకర్, నవీన్ పాల్గొన్నారు.

◆ **టికెట్ కోసం దరఖాస్తులు**

నర్సాపూర్: నర్సాపూర్ శాసనసభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ కోసం పలువురు నాయకులు దరఖాస్తు చేశారు. తెలంగాణ పీసీసీ ఉపాధ్యక్షుడు మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, తెలంగాణ పీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్, రవీందర్‌రెడ్డి దరఖాస్తు చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రిజ్వాన్, నాయకులు ఉన్నారు.

పాపన్నపేట(మెదక్): కాంగ్రెస్ తరపున మెదక్‌లో పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నట్లు మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి అన్నారు.

◆ **అల్లాదుర్గం తహసీల్దార్‌గా సతీశ్**

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం తహసీల్దార్‌గా సతీశ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సిద్దిపేట తహసీల్దార్‌గా ఉన్న సతీశ్ అల్లాదుర్గంకు బదిలీపై వచ్చారు. అల్లాదుర్గంలో విధులు నిర్వహిస్తున్న తులసీరాం వెల్దుర్తి మండలానికి బదిలీ అయ్యారు.

◆ **తండాలో కార్డన్ సర్చ్**

నిజాంపేట(మెదక్): మండలంలోని జెడ్ చెరువు తండా గ్రామంలో శుక్రవారం రామయంపేట సీఐ లక్ష్మీబాయి ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సర్చ్ చేశారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 20 వాహనాలను స్వాదీనం చేసుకున్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, నారాయణగౌడ్, జ్యోతి, హైమద్, ఏఎస్ఐలు మాణిక్ ప్రభు, రాంబాబు, లక్ష్మణ్, హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్, సునీత, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

◆ **పేద కుటుంబాలకు అండగా ఉంటా**

శివ్వంపేట(నర్సాపూర్): అపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా ఉంటానని జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా అన్నారు. మండల పరిధిలోని లచ్చిరెడ్డిగూడం గ్రామానికి చెందిన కార్తీక్ పాముకాటుతో, మాలోత్ తీర్య అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో శుక్రవారం బాధిత కుటుంబాలను జెడ్పీటీసీ పరామర్శించి, రూ.5 వేల నగదుతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ రాంరెడ్డి, తదితరులు ఉన్నారు.